దర్యాప్తులో ఉన్న కేసులపై సమగ్ర విచారణ చేపట్టాలి

- చట్ట ప్రకారం నేరస్థులకు శిక్ష పడేలా కృషి చేయాలి
- రాబోయే పండుగలు.. స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి
- జిల్లా పోలీస్ అధికారుల సమీక్షలో ఎస్పీ యోగేష్ గౌతమ్



మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): దర్యాప్తులో ఉన్న కేసులపై సమగ్ర విచారణ చేపట్టి చట్ట ప్రకారం నేరస్థులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. గురువారం నారాయణపేట ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు అధికారులతో నెల వారి నేర సమీక్ష సమావేశం నిర్వ హించారు. పెండింగ్ కేసులు న్యాయాధికారులు, డాక్టర్లతో సమన్వయం కలిగి ఉండి వెంటనే పెండింగ్ కేసులు క్లియర్ చేయాలన్నారు. సమీక్షనుద్దేశించి ఎస్పీ మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచరాదన్నారు. జిల్లాలో మిస్సింగ్ కేసులను వెంటనే పట్టుకోవాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. పాత నేరస్థులు, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రోబోయే స్థానిక సంస్థాగత ఎన్నికలు, గణేష్ ఉత్సవాలకు సంబంధించి ముందస్తుగా సంసిద్ధంగా ఉండాలన్నారు. వర్షాల పట్ల అప్రమ త్తంగా ఉండి ప్రజలు మిద్దె ఇళ్లు, లోతట్టు ప్రాంతాల్లో ఉండరాదన్నారు. పిల్లలు నదులు, కుంటలు, చెరువులు, వాగుల వద్దకు చేపలు పట్టడానికి, ఈత కొట్టడానికి, సెల్ఫీలు దిగేందుకు వెళ్లరాదన్నారు. డీఎస్పీలు లింగయ్య, మహేష్, సీఐలు శివశంకర్, రామ్‌లాల్, రాజేందర్‌రెడ్డి, సైదులు, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రాముడు, రాజు, భాగ్యలక్ష్మిరెడ్డి, నవీద్, రాము, రమేష్, విజయ్, రాజశేఖర్, సునిత తదితరులున్నారు.

కురుమూర్తి వాసా.. గోవిందా..

- కురుమూర్తి ఆలయానికి పోటెత్తిన భక్తులు



స్వామి వారి ఆలయం ఎదుట దీపాలు వెలిగిస్తున్న భక్తులు

చిన్నచింతకుంట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పేదల తిరుపతిగా, తిరుమల వేంకటేశ్వరుని ప్రతిరూపమైన కురుమూర్తి స్వామి వారి ఆలయానికి గురువారం అమావాస్య కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు స్వామి వారి దర్శనం కోసం తరలి వచ్చారు. స్వామి వారి గుట్టపైకి వెళ్లే క్యూ లైన్లలో భక్తులు బారులు తీరారు. దీంతో అడుగడుగునా గోవిందా... గోవిందా... కురుమూర్తి వాసా గోవిందా.. అంటూ స్వామి వారి గిరులు, కాంచన గుహ అంతా నామస్మరణతో పులకించిపోయాయి. ఇదిలా ఉండగా జాతర మైదానంలోనూ పెద్ద ఎత్తున జనసంద్రం కనిపించింది. వివిధ రకాల దుకాణ సముదాయాలు కూడా వెలిశాయి.

వర్షపు నీటిలో పాఠశాల



తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

వర్షపు నీరు ఆ పాఠశాలను చుట్టేశాయి. మరికల్ మండల పరిధిలోని పసుపుల గ్రామంలో చిన్నపాటి వర్షానికి గురువారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోకి నీరు చేరింది. చెరువుకుంటగా మారడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పాఠశాల గదుల్లోకి నీరు చేరడంతో కూర్చోవడానికి స్థలం లేక, ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయలేక పోయారు. కనీసం మధ్యాహ్న భోజనం నిర్వహించడానికి కూడా వీలులేని పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- మరికల్, ఆంధ్రజ్యోతి

ఆశల సాగు



- వారం రోజులుగా సమృద్ధిగా వర్షాలు
- మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అధికం
- చెరువులు, కుంటల్లోకి చేరుతున్న నీరు
- వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో లోటు వర్షపాతం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. ఈ వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటల్లోకి సమృద్ధిగా నీరు వచ్చి చేరింది. సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదు కావడంతో కొన్ని పంటలకు ఊతం ఇచ్చినట్లయింది. మరో వారం పాటు కురిస్తే చెరువులు అలుగులు పారనున్నాయి. వీటిపై ఉన్న చెక్‌డ్యాంలు నీటి సుడులు తిరుగనున్నాయి. ఈ వర్షాలతో అన్నదాతలు కరిగెట్లు చేసి వరి నాట్లు వేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న, జొన్న కంది పంటలకు కూడా ఈ వర్షాలు మేలు చేకూర్చనున్నాయి.



దామరగిద్ద మండలంలో కందిపంట

మహబూబ్‌నగర్/ నారాయణపేట/ నాగర్‌కర్నూల్/ వనపర్తి/ గద్వాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరులో జోగులాంబ గద్వాల, వనపర్తి మినహా మిగిలిన మూడు జిల్లాల్లో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. కాస్తా ఆలస్యమైనా విస్తారంగా కురుస్తున్న వానలతో పొలం పనులు జోరందుకున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని 17 మండలాలకు గాను ప్రస్తుతం 11 మండలాల్లో సాధారణం కన్నా అధిక వర్ష పాతం నమోదయ్యింది. మరో 6మండలాల్లో సాధారణ వర్షపాతం ఉంది. జూలై 24 నాటికి జిల్లాలో 202.7 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, 284.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సాధారణం కన్నా 40.5 మిల్లీమీటర్ల అధిక వర్షపాతం నమోదైంది. బాలానగర్ మండలంలో 156.5 శాతం అధిక వర్షపాతం నమోదుకావడం విశేషం. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలకు భారీగా వరదనీరు చేరుతోంది. చెరువుల్లో ఇప్పటికే సగానికి పైగా నీరు వచ్చింది. మరో వారం, పది రోజులు ఇదే రీతిలో వర్షాలు పడితే అలుగులు పారనున్నాయి. దుందుభీ, పెద్దమ్మ వాగులు పారుతున్నాయి. వాగులపై ఉన్న చెక్‌డ్యామ్‌లు అలుగులు దుంకుతున్నాయి. దీంతో భూగర్భజలాలు కూడా పెరిగి, బోర్లు రీచార్జి అవుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వానలు వరి పంటలకు ప్రయోజనం చేకూర్చుతున్నాయి. అన్నదాతలు కరిగెట్లు చేసి వరి నాట్లు వేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న, జొన్న, కంది పంటలకు కూడా ఈ వర్షాలు మేలు

- మిగతా 7లో..



మక్తల్ మండలం పారేవులలో ట్రాక్టర్‌తో కరిగెట పనులు

ముసుగేసిన ముసురు

- నారాయణపేటలో 47.0 మి.మీ. వర్షపాతం
- సిర్సవాడలో దుందుభి వాగు పొంగడంతో రాకపోకలు బంద్
- కూలిన ఇల్లు, పాఠశాల చుట్టూ చేరిన నీరు

7



మక్తల్ మండలం పారేవులలో వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు

ఆహ్లాదం.. ఆధ్యాత్మికం

- బాదేపల్లి పెద్దగుట్ట అభివృద్ధి చేస్తే మరో పర్యాటక కేంద్రం
- పెద్దగుట్టపై వెలిసిన శ్రీరంగనాయకస్వామి
- నేటి నుంచి శ్రావణమాస ఉత్సవాలు

6



పెద్దగుట్టపై ఉన్న శ్రీరంగనాయకస్వామి దేవాలయం

32 అద్దె దుకాణాల సీజ్

- వీటిపై రూ. 6 కోట్ల బకాయి
- వెలవెలబోతున్న క్లాక్‌టవర్ చౌరస్తా

మహబూబ్‌నగర్, జూలై 24 (ఆంధజ్యోతి) : నగరపాలక సంస్థ అద్దె దుకాణాల బకాయిలు పేరుకుపోవడంతో కార్పొరేషన్ అధికారులు కొరడా ఝుళిపించారు. నగరంలోని గడియారం చౌరస్తాలోని 32 దుకాణాలను గురువారం కార్పొరేషన్ అధికారులు సీజ్ చేశారు. ఈ దుకాణాలపై కొన్నేళ్లుగా రూ.6 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఇప్పటికే పలుమార్లు అధికారులు నోటీసులు జారీ చేసినా బకాయిలు వసూలు కావడం లేదు. 3 నెలల క్రితం ఇదే తరహాలో దుకాణాలను సీజ్ చేశారు.

ఆ సమయంలో వ్యాపారులు అధికార పార్టీ నాయకులతో పైరవీలు చేసి బకాయి మొత్తంలో 5శాతం చెల్లించి దుకాణాలను తెరిపించుకున్నారు. మూడు నెలల్లో మొత్తం బకాయిలను క్లియర్ చేయాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటి వరకు కొందరు 10 శాతం, మరికొందరు 15 శాతం వరకు అద్దెలు చెల్లించారు. ఆశించిన స్థాయిలో బకాయిలు వసూలు కాకపోవడంతో అధికారులు దుకాణాలను సీజ్ చేశారు. 100 శాతం చెల్లించిన తర్వాతనే దుకాణాలను తిరిగి ఓపెన్ చేయడం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. కాగా, గడియారం చౌరస్తాలో దుకాణాలన్నీ మూతపడడంతో చౌరస్తా వెలవెలబోతున్నది.



క్లాక్‌టవర్‌లో దుకాణ సముదాయాలు సీజ్ చేస్తున్న కార్పొరేషన్ అధికారులు

స్నానం చేసి వారమైంది?

- సమస్యలు పరిష్కరించాలని రోడ్డెక్కిన విద్యార్థినులు 6

రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

- బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు మక్సూద్ బిన్ జాకీర్
- రాష్ట్రస్థాయి టోర్నీకి తరలిన జిల్లా జట్టు 6

విద్యుదాఘాతంతో 6 స్కూల్ బస్సు దగ్ధం

యూరియా కోసం 6 పడిగాపులు

మందకొడిగా..

- రైతు నమోదు ప్రక్రియ

- ప్రతీ రైతుకు గుర్తింపు కార్డులు
- 14 నెంబర్లతో యూనిక్ కోడ్ కేటాయింపునకు కేంద్రం నిర్ణయం
- జిల్లాలో రైతాంగం వివరాలు సేకరిస్తున్న 64 మంది ఏఈవోలు
- ఈ ఫార్మర్ ఐడీల కేటాయింపు
- జిల్లాలో 39 శాతం మాత్రమే పూర్తి



ఊట్కూర్ మండలం పెద్దజట్రం క్లస్టర్‌లో రైతు గుర్తింపుకార్డు నమోదులో ఏఈవో స్వప్న (ఫైల్)

నారాయణపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నత్తనడకన నడుస్తున్నది. రెండు నెలల కింద ప్రారంభైనా జిల్లాలో 39 శాతం మాత్రమే పూర్తియింది. ఇంకా 71 శాతం రైతు నమోదు ప్రక్రియ జరగాల్సి ఉంది. ముఖ్యంగా రైతులు పంట పొలాల సాగులో బిజీబిజీగా ఉండడంతో పాటు చాలా మంది రైతులవి ఆధార్ ఫోన్‌లకు అనుసంధానం కాకపోవడం అయినా ఫోన్‌నంబర్లు మారడంతో మూడుసార్లు వచ్చే ఓటీపీతో సాంకేతిక సమస్యలు తోడవుతున్నాయి. పలువురు రైతులు స్థానికంగా ఉండక పోవడం.. ఉన్నా కొందరు ఆసక్తి చూపకపోవడం వంటి కారణాలతో మందకొడిగా నడుస్తున్నదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ఆధార్‌తో ప్రతీ పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లుగానే..

ప్రతీ రైతుకు 14 నెంబర్లతో విశిష్ట సంఖ్య (యూనిక్‌కోడ్)ని కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్వహించింది. దాంతో జిల్లా వ్యాప్తంగా 4,59,000 భూమి ఉండగా 4,25,000 ఎకరాల భూమి సాగుకు యోగ్యంగా ఉంది. 250 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 1,92,013 మంది పట్టాదారులున్నారు. 4,84,739 మంది రైతులు ఉన్నారు. జిల్లాలో 76 రైతు వేదికలు ఉండగా జిల్లా వ్యసాయ అధికారి జాన్ సుధాకర్ ఆధ్వర్యంలో 64 మంది ఏఈవోలు రైతులకు సబంధించిన పూర్తి వివరాలు మొబైల్ యాప్‌లో క్రోడీకరించి నమోదు చేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో ఈ ప్రాజెక్టును చేపడ్తుంది.

ప్రతీ రైతుకు తనకు ఉన్న భూములకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారంతో ఈ ఫార్మక్ రిజిస్ట్రీ నిర్మించబడుతుంది. రెవెన్యూశాఖ ద్వారా సేకరించిన భూ యజమాని వివరాలను రైతు యొక్క ఆధార్ సంఖ్యను అనుసంధానం చేయడం ద్వారా ఈ ఫార్మర్ ఐడీని కేటాయిస్తారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనుసంధానం చేయడం జరుగుతుంది. పీఎం కిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడత లబ్ధి పొందేందుకు ప్రామాణికంగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన పథకాలు అయిన రైతు భరోసా రుణమాఫీ తదితర రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీ ఏ రకమైన సంబంధం లేదు. రైతు విశిష్ట సంఖ్యను (ఫార్మర్ ఐడి) పొందేందుకు మీ ఆధార్, భూ యజమాని పాస్ బుక్ ఆధార్‌రు లింక్ చేయబడిన మొబైల్ నెంబర్ తీసుకొని సమీపంలోని వ్యవసాయ అధికారి లేక వ్యవసాయ విస్తరణ అధికారి రైతువేదికలను ఆశ్రయించి ఫార్మర్ ఐడీకి రిజిస్ట్రేషన్ చేసుకొనే వెసులు బాటు కల్పించారు. జిల్లా 1,92,013 మంది రైతులు ఉండగా ఇప్పటి వరకు 74,776 మంది రైతులవి రిజిస్ట్రేషన్‌తో 38.94 శాతం పూర్తి అయింది. జిల్లాలో రిజిస్టేషన్ పూర్తి అయిన రైతుల వివరాలు మండలాల వారిగా ఇలా ఉన్నాయి.



సంగంబండ జలాశయం గేటు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీరు

సంగంబండ రిజర్వాయర్

ఒక గేటు ఎత్తి నీటి విడుదల

మక్తల్‌రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం గేటు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి పెద్ద వాగు వరద ఎక్కువ వస్తుండడంతో గురువారం ఒక గేటు ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేశారు. 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 500 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉందని ఇరిగేషన్ డీఈ సురేష్ తెలిపారు.

రిజర్వాయర్ నీటి పూర్తి సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.4 టీఎంసీలు ఉందని వివరించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ విజయేందిర బోయి
- గండీడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కేజీబీవీల తనిఖీ



గండీడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

గండీడ్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పైలట్ ప్రాజెక్టులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల పరిధిలోని జానంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్న సమయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గండీడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ఉన్న కొత్తగా నిర్మాణం చేసిన భవనాన్ని అత్యవసరంలో వాడుకోవచ్చు అని సూచించారు. పాత, కొత్త భవనం మధ్య వర్షం నీరు నిల్వకుండా చూడాలని అధికారులకు సూచించారు. అటెండర్లు లేక ఇబ్బందిగా ఉందనడంతో త్వరలో పరిష్కారం అవుతుందని తెలిపారు. కేజీబీవీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం అందించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు సూచించారు. తహసీల్దార్ మల్లికార్జున్ రావు, ఇన్‌చార్జి విద్యాధికారి జనార్దన్, వైద్యాధికారి చంద్రశేఖర్, ఏపీవో హరిచంద్రుడు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో స్కూల్ బస్సు దగ్ధం



పూర్తిగా కాలిపోయిన బస్సు

హన్వాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ప్రైవేట్ స్కూల్ బస్సు దగ్ధమైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని వేపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోయిలకొండ మండల కేంద్రానికి చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు వేపూర్ గ్రామనికి వచ్చి విద్యార్థులను తీసుకెళ్లేది. బుధవారం పాఠశాలకు సెలవు ఉండడంతో మరమ్మతు చేయించారు. ఎప్పటిలాగే గురువారం విద్యార్థులను తీసుకెళ్లేందుకు వేపూర్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద బస్సు నిలిపారు. అర్ధరాత్రి దాటాక గురువారం తెల్లవారుజామున బస్సులోనే విద్యుదాఘాతంతో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పివేశారు. అప్పటికే బస్సు దగ్ధమైంది.

నాగర్‌కర్నూల్ కలెక్టర్‌కు మాతృవియోగం

» గుండెపోటుతో తల్లి శాంత మృతి



తల్లి శాంతతో కలెక్టర్ బదావత్ సంతోష్ (ఫైల్)

నాగర్‌కర్నూల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్‌కు మాతృవియోగం కలిగింది. బదావత్ సంతోష్ తల్లిదండ్రులు బదావత్ హరిలాల్-శాంతమ్మ దంపతులు స్వగ్రామమైన జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం సూరారంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం రాత్రి శాంతమ్మ (58)కు ఛాతీ నొప్పి రావడంతో చికిత్స నిమిత్తం ఆమెను హుటాహుటిన హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె గురువారం తెల్లవారు జామున మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. హరిలాల్ - శాంతమ్మకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడైన బదావత్ సంతోష్ నాగర్ కర్నూల్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మధ్యాహ్నం సూరారంలో అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్, జనగామ కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్, మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, నాగర్‌కర్నూల్ వైద్యాధికారి స్వరాజ్యలక్ష్మి, వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరై నివాళులర్పించారు.

బాలికను కాపాడిన షీ టీం

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పెద్దకొత్తపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(14) తల్లిదండ్రులతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని లక్కవరం పరిధిలో గుంపు మేస్త్రీ కింద పని చేయడానికి వెళ్లింది. కొన్ని రోజుల క్రితం వారు అక్కడి నుంచి సొంత గ్రామానికి వచ్చేశారు. అయితే బాలికను పంపించకుండా గుంపు మేస్త్రీ అక్కడే పెట్టుకోవడంతో తల్లిదండ్రులు నాగర్‌కర్నూల్ షీటీంను ఆశ్రయించారు. అడిషనల్ ఎస్పీ రామేశ్వర్ ఏపీ పోలీస్ అధికారులతో మాట్లాడారు. బాలిక ఉన్న ప్రదేశానికి బృందాన్ని పంపించారు. అనంతరం అక్కడి సఖి కేంద్రంలో ఉంచిన అనంతరం నాగర్‌కర్నూల్ ఎస్పీ కార్యాలయానికి తీసుకొచ్చారు. గురువారం బాలల సంరక్షణ అధికారులకు బాలికను అప్పజెప్పారు. దీంతో బాలిక తల్లిదండ్రులు షీటీం బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఇంట్లో ధ్వంసమైన బీరువా

వడ్డేపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ గద్వాల జిల్లా శాంతినగర్ పట్టణంలో గ్యాస్ భాస్కర్‌రావు ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. కాగా భాస్కర్‌రావు సమీప బంధువు మృతి చెందడంతో బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి చిలకలూరిపేటకు వెళ్లారు. అంత్యక్రియలు ముగించుకుని అదే రోజు రాత్రి ఇంటికివచ్చి చూడగా, తెలుపులు తెరచి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి గురువారం ఉదయం చోరీకి గురైన ఇంటికి పరిశీలించి యాజమాని ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీరువాను పగులగొట్టి రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఎస్‌ఐకి ఫిర్యాదు చేసిన ట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ఆవు మృతి

వడ్డేపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మునిసిపాలిటీలోని పైపాడు గ్రామంలో కురువ శేషన్నకు చెందిన ఆవు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేతకు వెళ్లి షాక్‌కు గురై గురువారం మృతిచెందింది. పైపాడు స్టేజి ప్రధాన రహదారి వెంట ఉన్న ట్రాన్స్‌ఫార్మన్‌కు రక్షణ కంచె లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆవు మృతి చెందిందని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపినా రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆవు విలువ రూ.40వేలు ఉంటుందని తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వృద్ధురాలి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కడుపునొప్పి భరించలేక వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలంలోని గన్యాగుల గ్రామానికి చెందిన కురుమేంటి బాలమ్మ(60) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేది. మందులు వాడినా తక్కువ కాకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం రాత్రి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. కుటుంబ సభ్యులు గుర్తించి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కుమారుడు మల్లయ్య ఫిర్యాదు మేరకు గురవాఆరం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బస్సులో మరిచిన ల్యాప్‌టాప్ తిరిగి అప్పగింత

జడ్చర్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ను తిరిగి ప్రయాణికుడికి అప్పగించిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల కొత్తబస్టాండులో చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా సిర్‌వార్ గ్రామానికి చెందిన కోటేశ్వర్ గురువారం రాయచూర్ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులో ఎక్కాడు. మహబూబ్‌నగర్‌లో కొద్దిసేపు ఆగిన బస్సులో నుంచి దిగాడు. అదే సందర్భంలో బస్సు బయలుదేరింది. అందులో తన ల్యాప్‌టాప్ బ్యాగుతో పాటు విలువైన పత్రాలు ఉన్నాయంటూ మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండులోని అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే బస్సు వివరాలను తెలుసుకుని జడ్చర్ల కొత్తబస్టాండులోని స్టేషన్ మేనేజర్ రవీంద్రనాథ్‌కు సమాచారం చేరవేశారు. జడ్చర్లకు వచ్చిన బస్సులో నుంచి ఆ బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సదరు ప్రయాణికుడికి పూర్తి వివరాలు తెలుసుకుని ల్యాప్‌టాప్ అప్పగించారు. కార్యక్రమంలో శివరాముడు, వెంకటయ్య, నర్సింహులు ఉన్నారు.

ఆహ్లాదం.. ఆధ్యాత్మికం

» బాదేపల్లి పెద్దగుట్ట అభివృద్ధి చేస్తే మరో పర్యాటక కేంద్రం
» పెద్దగుట్టపై వెలిసిన శ్రీరంగనాయకస్వామి
» సొరంగాలు, గుహలతో ఉన్న గుట్ట
» నేటి నుంచి శ్రావణమాస ఉత్సవాలు



జడ్చర్ల మునిసిపాలిటీ, బాదేపల్లి పాతబజారు సమీపంలోని పెద్దగుట్ట (శ్రీరంగనాయకస్వామిగుట్ట)



శ్రీరంగనాయకస్వామి మూలవిరాట్

జడ్చర్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని బాదేపల్లి పెద్దగుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదవాతావరణం ఏర్పడనుంది. అందుకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం, పర్యాటక కేంద్రంగా చేపట్టాల్సిన చర్యల పై సర్వే సైతం నిర్వహించారు. కానీ ఆ దిశగా అడుగు పడటం లేదు.

గుట్టపై 8 ఎకరాలకు పైగా స్థలం

బాదేపల్లి పాతబజారు సమీపంలోని రంగనాయక స్వామిగుట్టపై దాదాపు 8 ఎకరాల స్థలం ఉంది. ఆ స్థలంలోనే స్వయంభుగా వెలిసిన రంగనాయకస్వామి ఆలయం ఉంది. ఆలయం వద్ద ఆహ్లాదకరంగా కోనేరు ఉంది. కప్పగుండుతో పాటు పెద్దగుండ్లు ఉన్నాయి. ప్రస్తుతం కప్పగుండు వద్ద వేంకటేశ్వరస్వామి నామాలు ఏర్పాటు చేయగా, వాటికి అమర్చిన లైటింగ్‌తో రాత్రి వేళల్లో సుమారు 30 నుంచి 40కిలోమీటర్ల వరకు కనిపిస్తుంది. మరో వైపు నామాలను ఏర్పాటుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. పెద్దగుట్ట కుపైకి వెళ్లే మార్గం నుంచి పెద్దగుట్టపై దేవాలయాలు ఉన్నాయి. గుట్టపై పర్యాటక కేంద్రంగా మారిస్తే గుట్టకు మరింత శోభకలగనుంది.

గుహలు, సొరంగ మార్గాలు..

రంగనాయకస్వామిగుట్టపై నుంచి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న గంగాపురం లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం వరకు, అలాగే గంగాపురం సమీపంలోని కోడుపర్తి గ్రామంలో ఉన్న ఆలయం వరకు సొరంగమార్గాలు ఉన్నాయని పెద్దలు చెప్తుంటారు. పెద్దగుట్టపై ఉన్న నుంచి గుట్ట మధ్యలోకి వచ్చేవిధంగా గుహలు ఉన్నాయి. ఆ గుహలలో వెలుతురు పడడంతో పాటు గాలి సైతం వీస్తుంది. దీంతో మేకలు, గొర్రెలను మేపేందుకు వెళ్లే వారంతా ఆ గుహలలో సేదతీరేవారని స్థానికులు తెలిపారు. పలు ప్రాంతాలలో చోరీలు చేసిన సొమ్ముతో గుట్టపై ఉన్న ఓ గుహలో దాక్కునేవారని, ఆ గుహను నేటికీ దొంగల గుహగా పిలుస్తారని స్థానికులు చెపుతారు.

స్వామి విగ్రహంపై నిలవని పైకప్పు

పెద్దగుట్టపై రంగనాయకస్వామి స్వయంభువుగా వెలిశాడు. ఆలయంలో రంగనాయకుడు లక్ష్మీసమేతంగా శేషతల్పంపై ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా సేదతీరుతున్న ప్రసన్నమూర్తిగా దర్శనమిస్తాడు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన దేవాలయంలోని మూలవిరాట్‌పై పైకప్పు నిలవదు. వేసినా అది నిలబడదని పెద్దలు చెప్తుంటారు. కొందరు నిర్మించేందుకు ప్రయత్నించినా సాధ్యం లేదని తెలిసింది. వెనకభాగంలో పెద్దగుండుకు కాలభైరవుడు, అమ్మవారి రూపాలు వెలిశాయి. పెద్దగుట్టకు వెళ్లేందుకు మెట్ల మార్గం, మరో వైపు వాహనాలు వెళ్లేలా రోడ్డు ఉంది. పెద్దగుట్టకు వెళ్లే మెట్ల మార్గం వద్ద గుహలో వీరభద్రుడి ఆలయం ఉంది. మెట్లమార్గం పక్కనే శివాలయం, గుట్టకు ముందు భాగంలో నామాలగుండు ప్రత్యేకం. ఆ ప్రాంతంలో చెన్నకేశవస్వామి ఆలయం ఉంది.

నేటి నుంచి శ్రావణమాస ఉత్సవాలు

ప్రతీ ఏడాది గుట్టపై శ్రావణమాసంలో ఉత్సవాలు నిర్వహిస్తారు. దేవాలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గుట్టపై వెలిసిన స్వామిని దర్శించుకునేందుకు జడ్చర్ల పరిసర ప్రాంత ప్రజలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. గుట్టపైకి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు కూర్చునేందుకు షెడ్ నిర్మాణం చేపట్టారు.

నెల రోజుల పాటు ఉత్సవాలు



రంగనాయకస్వామికి శ్రావణమాసంలో నెలరోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. కొన్ని వందల సంవత్సరాలుగా కేవలం శ్రావణమాసంలోనే స్వామి వారికి ఉత్సవాలు నిర్వహిస్తారు. గతేడాది స్వామి వారిని దర్శించుకునేందుకు లక్ష అడుగులు కార్యక్రమం నిర్వహించాం. ఈ సంవత్సరం దంపతులు వచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించే వారికి ప్రతీ రోజు లక్కీడ్రా నిర్వహిస్తున్నాము. డ్రాలో గెలుపొందిన జంటకు మాత్రమే పట్టువస్త్రాలను బహుమతిగా ఇవ్వనున్నాము. స్వామివారిని దర్శించుకుని పూజలు చేస్తే కోరికలు తీర్చుతాడన్న నానుడి ఉంది.

- కాల్వ రాంరెడ్డి,
దేవాలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు

రైతులకు సరిపడా యూరియా అందిస్తాం

» ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి పద్మహర్ష



నాగర్‌కర్నూల్ పీఏసీఎస్‌లో ఎరువులను తనిఖీ చేసి రైతులతో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి పద్మహర్ష

కందనూలు/ బిజినేపల్లి / జడ్చర్ల/ భూత్పూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సరిపడా యూరియాను అందజేస్తామని స్టేట్ మార్కెటింగ్ డైరెక్టర్, ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి పద్మహర్ష తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పీఏసీఎస్ ఎరువుల నిల్వలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల కోసం వచ్చిన రైతులతో మాట్లాడారు. మోతాదుకు మించి యూరియాను వాడొద్దని సూచించారు. ఎవరైనా యూరియాతో పాటు ఎరువులను అక్రమంగా నిల్వ చేసి కొరత సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు, డివిజన్ అధికారి పూర్ణ చంద్రారెడ్డి, ఏవో రాజు, పీఏసీఎస్ అధికారి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

అదేవిధంగా బిజినేపల్లి మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాంలోని ఎరువుల నిల్వలను, పంపిణీ వివరాలను తెలుసుకున్నారు. భూసార పరీక్షలు చేయించి లోపించిన ఎరువులను మాత్రమే పంటకు అందించాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు నిల్వలు సంమృద్ధిగా ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

● జడ్చర్లలోని హకా ఫార్మర్ సర్వీస్ సెంటర్‌లతో పాటు పలు ఫర్టిలైజర్స్ దుకాణాలలో ఎరువుల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఎరువుల పంపిణీ పీవోఎస్ మిషన్ల ద్వారా జరుగుతుందా, లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు.

భూత్పూర్ మండల కేంద్రంలో ఉన్న అన్నదాన, సహకార ఫార్మా సర్వీస్ స్టేషన్, ఆగ్రో రైతు సేవా కేంద్రం, స్థానిక సహకార సంఘం ఎరువుల దుకాణాలను స్టాక్ వివరాలను పరిశీలించారు

స్నానం చేసి వారమైంది?

» సమస్యలు పరిష్కరించాలని రోడ్డెక్కిన విద్యార్థినులు



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారులు

ధన్వాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ధన్వాడ ఆదర్శ వసతి గృహంలో నెలకొన్న సమస్యలను తీర్చాలని గురువారం విద్యార్థినులు రోడ్డెక్కారు. వారం రోజుల నుంచి మరుగుదొడ్లు, బాత్‌రూంలు పూర్తిగా దెబ్బతిన్నాయని, దీంతో స్నానం చేయడం లేదని తెలిపారు. అధికారులు మా గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. గంటపాటుగా రోడ్డుకు అడ్డంగా కూర్చోవడంతో వాహనలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. డీఈవో గోవిందరాజులు, ఏఎంవో నర్మద, ఎంఈవో గాయత్రి, ఎస్‌ఐ రాజశేఖర్ విద్యార్థినులకు నచ్చజెప్పి, సమస్యలు పరిష్కారిస్తామన్నారు. ప్రస్తుతం మరమ్మతు పనులు చేస్తున్నామంటూ చెప్పారు. అధికారులు ఎంత చెప్పినా వినకుండా రోడ్డుపైనే బైఠాయించారు. ఒక్క రోజు సమయం ఇస్తున్నాం.. సమస్య పరిష్కారం చూయించకపోతే మళ్లీ రోడ్డెక్కుతామంటూ వారు హెచ్చరించి రాస్తారోకో విరమించారు. ఆందోళనకు పీడీఎస్‌యూ మండల అధ్యక్షుడు మహేశ్ నాయకత్వం వహించారు.

కేంద్ర మంత్రిని కలిసిన మధ్యాహ్న భోజన కార్మికులు



కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రదాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికుల రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్‌ను కలిసినట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు హమీద్‌ఖాన్ తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం మధ్యాహ్న భోజన కార్మికులకు నెలసరి వేతనం కేవలం రూ.3 వేలు ఇస్తున్నారని, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కనీస వేతనం రూ.17 వేలు ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. వంట కూలీలను కార్మిక చట్టం పరిధిలోకి తేవాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయాలు కల్పించాలని కేంద్ర మంత్రికి విన్నవించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వడ్ల హనుమంతుడు చారి, డి.బాబాయ్, బుర్ర మంజుల, సంతోషి గౌట్టి, గంగన్న, భారతమ్మ, విజయమ్మ, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

» జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు మక్సూద్ బిన్ జాకీర్
» రాష్ట్ర స్థాయి టోర్నీకి తరలిన జిల్లా జట్లు



ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్టుతో ప్రతినిధులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు మక్సూద్ బిన్ జాకీర్ తెలిపారు. గద్వాల ఉత్తనూరులో శుక్రవారం నుంచి నిర్వహించనున్న అంతర్ జిల్లాల జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లు తరలివెళ్లాయి. గురువారం జిల్లా స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జట్టు క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో కార్యదర్శి నస్రుల్లా హైదర్, సుబహాన్‌జీ, మీర్‌ఖలేద్‌అలీ, మహ్మద్‌ఇలియాజ్, గోపాలకృష్ణ, షకీల్‌అహ్మద్, ప్రియాంక పాల్గొన్నారు.

జట్ల వివరాలు..

బాలుర జట్టు: ఆదిత్యనారాయణ్, సంతోష్‌కుమార్, రాజరామ్‌చరణ్, భానుప్రకాష్, ద్రోణదత్త, వివేక్, షేక్‌అబ్దుల్లా, మహ్మద్‌రియాన్, రామ్‌చరణ్, అనిల్, రోహిత్, వసంత్.

బాలికల జట్టు: హర్షిత, చైత్ర, సాయినిఖిత, వైష్ణవి, శ్రీజ, పవిత్ర, రాజేశ్వరి, దీక్ష, చందన, కె. శ్రీజ, జ్యోతి, ఎం.వైష్ణవి.

కార్పొరేట్‌కు రాయితీలు.. శ్రమజీవులకు కష్టాలు

» పెండింగ్ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలి
» సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల నరసింహ

ఆత్మకూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ వ్యాపార దిగ్గజాలకు రాయితీలు, బ్యాంకు రుణాల మాఫీలు చేస్తున్న మోదీ ప్రభుత్వం.. దేశ సంపదకు సృష్టికర్తలైన కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తూ మోయలేని భారాలు మోపడం సిగ్గుచేటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ విమర్శించారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో సీపీఐ జిల్లా మూడో మహాసభల్లో భాగంగా గురువారం ప్రతినిధుల సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో సగటు జాతీయ ఆదాయంలో 80శాతంలో అదాని, అంబానీ లాంటి కుబేరుల చేతుల్లో కేంద్రీకృతమైందన్నారు. దీని ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో తీవ్రమైన సంక్షోభం నెలకొందని ఆరోపించారు. బీజేపీ అధికారం చేపట్టగానే దేశంలోని నల్ల కుబేరుల ధనాన్ని కొల్లగొట్టి దేశ జనాభాకు పంచుతానని చెప్పారన్నారు. మోదీ ప్రభుత్వం నల్ల కుబేరులకే ఎర్ర తివాచీ పరిచి పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. వెనుకబాటుకు నెలవైన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు సంగంబండ, భూత్పూర్ నెట్టెంపాడు, కల్వకుర్తి ఎత్తిపోతల తక్షణమే పూర్తి చేసి రైతులకు సాగునీటిని అందించాలని కోరారు. కొత్తగా ఏర్పడిన వనపర్తి, నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూర్ జిల్లాలకు సరైన వనరులు లేక వెనకబాటు తనానికి నోచుకుంటున్నాయని తెలిపారు.

తక్షణమే జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి అభివృద్ధి బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో విజయరాములు, శ్రీహరి, కళావతమ్మ, మోష అబ్రహం, రమేష్, శ్రీరాములు, చంద్రయ్య, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు



కృష్ణ మండలం టైరోడ్డు వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

యూరియా కోసం రైతులకు పడిగాపులు తప్పడం లేదు. విస్తారంగా కురుస్తున్న వర్షాలు వరినాట్లు జోరందుకున్నాయి. అదే సమయంలో యూరియాకు డిమాండ్ పెరిగింది. రైతుల అవసరాలకు అనుగుణంగా సప్లయ్ లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కృష్ణా మండలం టైరోడ్డు వద్ద ఎరువుల దుకాణాల ఎదుట రైతులు యూరియా కోసం నిరీక్షిస్తున్న దృశ్యాలను గురువారం 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది. ఎరువులు రాగానే తీసుకొని వెళ్లాలని రైతులు గంటల తరబడి దుకాణాల ముందు వేచి ఉన్నట్లు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి ఫొటోజర్నలిస్ట్, మహబూబ్‌నగర్

కాంబోడియాలో సైబర్ మోసాలు..

105 మంది భారతీయుల అరెస్టు

- 138 ప్రాంతాల్లో కాంబోడియా పోలీసుల దాడులు
- 3,075 మంది అనుమానితుల పట్టివేత

న్యూఢిల్లీ, జూలై 24: కాంబోడియా కేంద్రంగా చైనా సైబర్ నేరగాళ్లు నిర్వహిస్తున్న కాల్ సెంటర్లపై అక్కడి పోలీసులు దాడులు జరిపారు. 15 రోజుల పాటు.. 138 ప్రాంతాల్లో జరిపిన ఈ దాడుల్లో మొత్తం 3,075 మంది అనుమానితులను అరెస్టు చేశారు. వీరిలో 105 మంది భారతీయులున్నారు. నిజానికి భారతీయులను ఉద్యోగాల పేరుతో కాంబోడియా, మయన్మార్ వంటి దేశాలకు తీసుకెళ్తున్న చైనా సైబర్ కేటుగాళ్లు.. వారిని అక్కడ నిర్బంధిస్తున్నారు. బలవంతంగా సైబర్ నేరాల కాల్ సెంటర్లు నిర్వహించేలా చేస్తున్నారు. మాట వినకుంటే.. కరెంటు షాకులివ్వడం, తిండితిప్పలు లేకుండా చేస్తూ.. హింసిస్తున్నారు. దీనిపై భారత ప్రభుత్వం పలు దఫాలుగా కాంబోడియా ప్రభుత్వంతో చర్చించింది. ఈ క్రమంలో కాంబోడియా పోలీసులు ఈ దాడులు జరిపారు. అరెస్టయిన వారిలో భారతీయులతోపాటు.. వివిధ దేశాల పౌరులు ఉన్నారు. కాగా.. ఈ దాడుల్లో అరెస్టయిన 105 మంది భారతీయులను వెనక్కి రప్పించేందుకు కేంద్ర హోంశాఖ చర్యలను ప్రారంభించినట్లు తెలుస్తోంది.

అమెరికాలో భారీగా పడిపోయిన జననాల రేటు

న్యూయార్క్, జూలై 24: అమెరికాలో సంతానోత్పత్తి దారుణంగా పడిపోతోంది. గతంలో ఎప్పుడూ లేనంత తక్కువగా గత ఏడాది జననాల రేటు నమోదైంది. 2024కు సంబంధించి వ్యాధి నియంత్రణ, నివారణ సెంటర్లు (సీడీసీ) తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో సంతానోత్పత్తి తగ్గిపోయిన విషయం స్పష్టమైంది. జనాభా భర్తీ రేటు ప్రకారం సగటున ప్రతి మహిళకు 2.1 కంటే ఎక్కువగా పిల్లలు ఉండాల్సిన తరుణంలో.. అమెరికాలో జననాల రేటు 1.6 కంటే తక్కువగా నమోదైందని సీడీసీ వెల్లడించింది. 1960ల్లో యూఎస్‌లో జననాల రేటు సుమారు 3.5గా ఉంది. ఆ తర్వాత నుంచి క్రమంగా క్షీణిస్తూ వస్తోంది. జననాల రేటు తగ్గిపోతోందన్న హెచ్చరికల నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం సంతానోత్పత్తిని పెంచడానికి ఇటీవల చర్యలు చేపట్టింది.

గర్భిణి అనుమానాస్పద మృతి

- భార్య మృతదేహంతో 3 రోజులు ఇంట్లోనే భర్త
- స్థానికులు గమనించడంతో పరారీ

బెంగళూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర పరిధిలోని హెణ్బూరు ధణిసంద్రలో ఓ గర్భిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె మృతదేహంతో భర్త ఇంట్లోనే మూడు రోజులపాటు గడిపాడు. ఆ ఇంట్లోంచి దుర్వాసన రావడంతో స్థానికులు గమనించారు. దీంతో బుధవారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివం, ఆయన భార్య సుమన్ ఆ ఇంట్లో నివసించేవారు. శివం పెయింటింగ్ పనులు చేసేవాడు. మూడురోజుల కిందట సుమన(22) అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆ రోజు శివం పనుల కోసం బయటకు వెళ్లాడు. భార్య మృతిచెందాక పనులకు వెళ్లాడా, ఆయన వెళ్లాక ఆమె మృతిచెందిందా అన్నది స్పష్టత లేదు. కానీ ఆ మరుసటి రోజు భార్య మృతదేహం వద్దే శివం గడిపినట్టు, అక్కడే మద్యం సేవించి, భోజనం చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. మూడో రోజు బుధవారం ఇంటి నుంచి దుర్వాసన రావడం మొదలైంది. దీంతో స్థానికులు ఆ రోజు మధ్యాహ్నం ఇంట్లోకి వెళ్లగా.. శివం ఒక్కసారిగా అక్కడి నుంచి పారిపోయాడు. వెంటనే వారు హెణ్బూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సుమన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని, శివం కోసం గాలిస్తున్నారు. సుమన మృతికి కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు.

అనిల్ అంబానీ సంస్థలపై ఈడీ దాడులు

న్యూఢిల్లీ, జూలై 24: మూడువేల కోట్ల రూపాయల బ్యాంకు రుణ మోసం, నగదు అక్రమ చలామణీ కేసు దర్యాప్తులో భాగంగా.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కంపెనీలు, ఎస్ బ్యాంకుకు చెందిన 35 కార్యాలయాలపై దాడులు చేశారు. నగదు అక్రమ చలామణీ నిరోధక చట్టం కింద 25 మందిని ప్రశ్నించారు. ఆయా కార్యాలయాల నుంచి పలు పత్రాలు, కంప్యూటర్ ఉపకరణాలను (ఎక్స్‌టర్నల్ హార్డ్ డిస్కులు, పెన్‌డ్రైవ్‌ల వంటివి) స్వాధీనం చేసుకున్నారు. 2017-2019 మధ్య 'ఎస్ బ్యాంకు' అధికారులకు రిలయన్స్ గ్రూపు కంపెనీలు లంచాలు ఇచ్చి.. ఆ బ్యాంకు నుంచి రూ.3000 కోట్ల మేర రుణాలు పొంది, ఆ రుణాలను అక్రమంగా దారి మళ్లించాయన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఆ రుణాల మంజూరుకు ఎస్‌బ్యాంకు వర్గాలు పలు నిబంధనలను ఉల్లంఘించాయని.. పాత తేదీతో రూపొందించిన రుణ మంజూరు గుర్తింపు పత్రాలను ఉపయోగించాయని.. మంజూరైన రుణాలను రిలయన్స్ గ్రూప్‌లోని పలు ఇతర సంస్థలకు, షెల్ కంపెనీలకు మళ్లించారని ఆరోపణలు రావడంతో.. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) 2022 సెప్టెంబరులో రెండు కేసులు నమోదు చేసింది. ఈ రెండు కేసుల్లోనూ ఎస్ బ్యాంకు సహ వ్యవస్థాపకుడు, ఆ బ్యాంకు మాజీ ఎండీ రాణా కపూర్ పేరును సీబీఐ ప్రస్తావించింది. సీబీఐ పెట్టిన రెండు కేసులతోపాటు.. ఈ వ్యవహారానికి సంబంధించి నేషనల్ హౌసింగ్ బ్యాంక్, సెబీ, నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ, బ్యాంక్ ఆఫ్ బరోడా ఇచ్చిన నివేదికల ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. బ్యాంకులను, షేర్‌హోల్డర్స్‌ను, ఇన్వెస్టర్లను, ఇతర ప్రభుత్వ సంస్థలను మోసం చేసి ప్రజాధనాన్ని దారి మళ్లించడానికి పక్కా ప్రణాళికతో ఈ ఫ్రాడ్‌కు రూపకల్పన చేసినట్టు ఆయా సంస్థలు ఇచ్చిన నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అప్పట్లో రిలయన్స్ గ్రూప్ కంపెనీలకు రుణం మంజూరు కావడానికి ముందే.. ఎస్ బ్యాంకు ప్రమోటర్లు 'నగదు (లంచం)' అందుకున్నట్టుగా ఈడీ తన ప్రాథమిక దర్యాప్తులో గుర్తించిందని విశ్వసనీయవర్గాల సమాచారం. ఎస్‌బ్యాంకు వద్దే కాదు.. కెనరా బ్యాంకు వద్ద సైతం ఆర్‌కామ్ ఇదే తరహాలో లంచాలిచ్చి రూ.1050 కోట్లకు పైగా రుణాలను పొందిన వైనంపైనా ఈడీ దృష్టి పెట్టినట్టు సమాచారం. రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ సంస్థ బ్యాంకులు జారీ చేసే ఏటీ-1 (అడిషనల్ టైర్-1) బాండ్లలో రూ.2850 కోట్ల దాకా పెట్టుబడి పెట్టిందని.. అందుకు బదులుగా ఆయా బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయని ('క్విడ్ ప్రో కోగా) ఈడీ భావిస్తున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. కాగా.. ఈడీ సోదాలతో తమ వ్యాపార కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావమూ పడలేదని రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రా కంపెనీలు వేర్వేరు ప్రకటనలు చేశాయి. ఈడీ సోదాలకు సంబంధించి మీడియా కథనాల్లో పేర్కొంటున్న ఆరోపణలు రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్) లేదా రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్) పదేళ్ల క్రితం జరిపిన లావాదేవీలకు సంబంధించినవని వెల్లడించాయి.

ఇదేం తీర్పు?

- నటుడు దర్శన్‌కు కర్ణాటక హైకోర్టు బెయిల్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం



బెంగళూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో కన్నడ నటుడు దర్శన్, ఇతర నిందితులకు బెయిల్ మంజూరుచేసిన హైకోర్టుపై సుప్రీంకోర్టు ఆగ్రహించింది. 'వివేకాన్ని వాడే హైకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చిందా.?' అని ఘాటుగా ప్రశ్నించింది. న్యాయ విచక్షణాధికారం తీవ్రంగా దుర్వినియోగం అయిందని వ్యాఖ్యానించింది. బెయిల్ ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు రిజర్వులో ఉంచింది. 'ఇలాంటి కేసుల్లో బెయిల్ ఇవ్వవచ్చా? హైకోర్టు చేసిన తప్పునే మేం కూడా చేయదలుచుకోలేదు. బెయిల్ తీర్పును ఇచ్చేముందు విచక్షణాధికారాన్ని కోర్టు ఉపయోగించిందో లేదో పరిశీలించాలని అనుకుంటున్నాం. అందువల్ల పిటిషన్‌పై తొందరపడి తీర్పు ఇవ్వడంగానీ, విడుదలకు లేక శిక్షలకు ఆదేశాలు ఇవ్వడంగానీ చేయబోం" అని న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా.. దర్శన్, ఇతర నిందితులకు బెయిల్ ఇచ్చిన తీరును బెంచ్ తప్పుబట్టింది. "ప్రతి బెయిల్ తీర్పును హైకోర్టు ఇలాగే రాస్తుందా? ఈ కేసును హైకోర్టు చూసిన దృష్టి ఎక్కువగా మమ్మల్ని ఇబ్బంది పెట్టింది. సెషన్స్ కోర్టు జడ్జి అయితే అర్థం చేసుకోవచ్చు. కానీ, హైకోర్టు న్యాయమూర్తి ఇలాంటి పొరపాటు చేయడమేంటి? ఇంతేనా జడ్జి అవగాహన?. ఇది కుట్ర, హత్యలకు సంబంధించిన కేసు కావడంతో మా స్వరం కొంచెం కటువుగానే ఉంటుంది." అని బెంచ్ తెలిపింది. రేణుకాస్వామి హత్య కేసులో నటుడు దర్శన్, నటి పవిత్రాగౌడ, ఇతర నిందితులకు గత ఏడాది డిసెంబరు 13న కర్ణాటక హైకోర్టు బెయిల్ ఇచ్చింది. దీనిపై కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విచారణ సందర్భంగా ఈ కేసులో పవిత్ర పాత్రపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. "అంతా మీవల్లే జరిగింది. మీరు అక్కడ లేకపోతే ఏ2 పట్టించుకునేవారుకాదు. ఏ2 స్పందించకపోతే మిగతావారూ పట్టించుకునేవారు కాదు. మొత్తం సమస్యకు మీరే కారణం." అంటూ ఆగ్రహించింది. దీనిపై పవిత్ర తరఫు న్యాయవాది స్పందిస్తూ.. "ఆమెకు (రేణుకాస్వామి నుంచి) అభ్యంతరకర మెజేస్‌లు వచ్చేవి. నేరుగా మాట్లాడిన కాల్ రికార్డులు లేవు. అపహరణ, హత్యతో ఆమెకు సంబంధం ఉన్నట్టు ఆధారాలు లేవు" అని వాదించారు. అయితే, తాము వాదనల లోతుల్లోకి వెళ్లదలుచుకోలేదని బెంచ్ స్పష్టం చేసింది. గార్డులు కిరణ్, పునీత్‌ల వాంగ్మూలాలను హైకోర్టు ఎందుకు తిరస్కరించిందని బెంచ్ నిలదీసింది. కర్ణాటక ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. కాల్ డేటా రికార్డులు, లోకేషన్ పిన్‌లు, దుస్తులపై, వాహనంలో దొరికిన డీఎన్‌ఏ, ఇతర ఆధారాలు వారిద్దరి వాంగ్మూలాలను ధ్రువీకరించాయని వాదించారు. సాక్ష్యాధారాల తీరుపై బెంచ్ పలు ప్రశ్నలు సంధించింది. "నిందితుల నుంచి మీరు మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. దాడి దృశ్యాలను దానిలో ఎలా బంధించారు?." అని ప్రశ్నించింది. దీనికి లూథ్రా బదులిస్తూ.. దాడి ఫొటోలు ఏ2కు ఫార్వర్డ్ అయ్యాయని, తనను కొట్టవద్దు అని హతుడు వేడుకొంటుండగా తీసిన ఫొటో కూడా అందులో ఉన్నదని తెలపగా, బెంచ్ విస్మయానికి గురయింది. "ఒకవైపు కొడుతున్నారు.. మరోవైపు ఫొటోకు పోజు ఇస్తున్నారు.. నిజంగా నమ్మలేకపోతున్నాం." అని వ్యాఖ్యానించింది. వారు తమ అభిమాన నటుడి కోసం ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉండే దర్శన్ అభిమాన సంఘానికి చెందినవారని లూథ్రా వివరించారు. "ఇదో కిరాతక హత్య. సోషల్ మీడియాలో పోస్టు చేశారనే కారణంగా రేణుకాస్వామిని కిడ్నాప్ చేసి కిరాతకంగా హతమార్చారు. నిందితులు దర్శన్, పవిత్రగౌడ సహా అందరి కండిషన్ బెయిల్‌ను రద్దు చేయాలి" అని ఆయన కోరారు. కాగా, దర్శన్ తరఫు న్యాయవాది కపిల్‌సిబల్ మరో కేసును వాదించేందుకు వెళ్లడంతో లిఖితపూర్వక వాదనల కోసం వారంరోజుల గడువు ఇస్తున్నామని బెంచ్ తెలిపింది. దీంతో బెయిల్ రద్దు కావచ్చునని నిందితులలో భయం పట్టుకుంది. నిందితులకు వ్యతిరేకంగానే తీర్పు ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. 'డెవిల్' సినిమా షూటింగ్ కోసం నటుడు దర్శన్ థాయ్‌లాండ్‌కు వెళ్లిన విషయం తెలిసిందే.

నకిలీ ఓట్లను అనుమతించేదే లేదు

- ఓటర్ల తొలగింపు అబద్ధం: సీఈసీ
- బిహార్‌లో ప్రత్యేక సవరణకు సమర్థన

న్యూఢిల్లీ, జూలై 24: బిహార్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ(ఎస్‌ఐఆర్)ను ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ గట్టిగా సమర్థించుకున్నారు. నకిలీ ఓటర్లు ఓటేయడానికి అనుమతించే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో అసలైన ఓటర్లను తీసివేస్తున్నామన్న విపక్షాల ఆరోపణలను ఖండించారు. ఈ ప్రక్రియను దేశవ్యాప్తంగా అమలు చేయబోతున్నట్లు ఆయన తాజాగా ప్రకటించారు. అయితే కర్ణాటకలో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని.. నూరు శాతం రుజువులున్నాయని.. ఒక నియోజకవర్గంలో వందలు, వేల అదనపు ఓటర్లను చేర్చారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అయితే నిరాధార ఆరోపణలు చేయొద్దని, రాజ్యాంగ సంస్థను బెదిరిస్తున్నారని ఈసీ ఆక్షేపించింది. కాగా, బిహార్లో ప్రత్యేక సవరణను నిరసిస్తూ ఇండియా కూటమి ఎంపీలు గురువారం పార్లమెంటు ద్వారం వద్ద వరుసగా నాలుగో రోజూ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రాహుల్ ఈసీపై విరుచుకుపడ్డారు. కర్ణాటకలో ఓ లోక్‌సభ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. దీనిపై 90 శాతం కాదు.. నూరు శాతం రుజువులు చూపిస్తామని తెలిపారు. అయితే.. రాహుల్ చేసిన ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది. నిరాధార ఆరోపణలు చేయడమే గాక.. రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల కమిషన్‌ను ఆయన బెదిరిస్తున్నారని విమర్శించింది.

జడ్జిల నియామకంలో జాప్యంపై విచారణ

- రెండు వారాల తర్వాత చేపట్టనున్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూలై 24: జడ్జిల నియామకంపై కొలీజియం చేస్తున్న సిఫార్సులను ఆమోదించకుండా కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తుండడాన్ని ప్రశ్నిస్తూ దాఖలైన వ్యాజ్యాలపై విచారణ జరిపేందుకు గురువారం సుప్రీంకోర్టు అంగీకారం తెలిపింది. రెండు వారాల తరువాత విచారణ చేపడుతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం పేర్కొంది. ఈ పిటిషన్లను 2023లోనే లిస్టు చేశారని, అనంతరం ఆకస్మికంగా వాటిని జాబితా నుంచి తొలగించారని సీనియర్ న్యాయవాది అరవింద్ దాతర్, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

ఆశల సాగు



వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండలం అన్నారం గ్రామ సమీపంలో వరి నాట్లు వేస్తున్న రైతులు

(5వపేజీ తరువాయి)

చేయనున్నాయి. అయితే వర్షాలు ఇలాగే కొనసాగితే రేగడి, సౌడు నేలల్లో పత్తి, మొక్కజొన్న పంటలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. రేగడి నేలల్లో కలుపు పెరిగిపోతుంది. నీరుచిమ్మతో పంట ఎరుపెక్కడం, తెగుళ్ళ బారిన పడే ప్రమాదం ఉంది.

జూన్‌లో లోటు.. ఈ నెలలో అధికం

నారాయణపేట జిల్లాలో గత నెల లోటు వర్షపాతం నమోదు కాగా, ఈ నెలలో సాధారణం కంటే అధిక వర్షం కురిసింది. గత నెలలో 87.5 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను, 52.6 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. 40 శాతం లోటు వర్షపాతం నమోదయ్యింది. ఈ నెలలో సాధారణ వర్షపాతం 109.7 మిల్లీమీటర్లు కాగా, ఇప్పటివరకు 170.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. మొత్తంగా 55 శాతం అధిక వర్షం కురిసింది. జిల్లాలో సాధారణం కంటే మరికల్‌లో 114 శాతం, మద్దూరులో 83 శాతం, ఊట్కూరులో 77 శాతం అధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో రైతులు వరి నాట్లు ఇప్పటికే పూర్తి చేసుకున్నారు. బోర్ల కింద వరి నారుమళ్లను సిద్ధం చేసుకున్న రైతులు కరిగేట్లు చేసుకొని నాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు. జిల్లాలో వరి సాగు 1.70 లక్షల ఎకరాలకు గాను, ఇప్పటి వరకు 42 వేల ఎకరాల్లో సాగయ్యింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఇప్పుడిప్పుడే చెరువుల్లోకి నీరు చేరుతోంది. వర్షాలు ఇదే రీతిలో కొనసాగితే చెరువులు నిండి, ఆయకట్టు పరిధిలో వరి నాట్లు జోరందుకోనున్నాయి. జిల్లాలో వానకాలం సాధారణ సాగు 4.42 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటికే 2.14 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు అవుతున్నాయి. పత్తి 1.40 లక్షలు, కంది 60 వేలు, పెసర 4 వేలు, పచ్చజొన్న 8 వేలు, ఇతర పంటలు రెండు వేల ఎకరాల్లో సాగయ్యాయి.

అత్యధికంగా పత్తి సాగు

నాగర్‌కర్నూల్ జిల్లాలో గత నెలలో సాధారణ వర్షపాతం 84.9 మిల్లీమీటర్లు కాగా, 90.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఈనెల 23వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 89.1 మిల్లీమీటర్లు కాగా, 141.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా రైతులు 3,542 ఎకరాల్లో వరి, 44,252 ఎకరాల్లో మొక్కజొన్న, 3,811 ఎకరాల్లో జొన్న, 2,670 ఎకరాల్లో కందులు సాగు చేస్తున్నారు. అత్యధికంగా 2,45,016 ఎకరాల్లో పత్తి సాగవుతుండటం విశేషం. పత్తి సాగుకు వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలించడంతో దిగుబడి కూడా అధికంగా ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు.



ఇంద్రకల్‌లో ఏపుగా పెరిగిన పత్తి పంట

ముసురు వానలతో సరి

వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా వనపర్తి జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. ఒకటి రెండు సారి భారీ వర్షాలు తప్ప ముసురు వానలే కురుస్తున్నాయి. ఈ ఏడాది జూన్‌లో సాధారణ వర్షపాతం 92.3 మిల్లీమీటర్లకు గాను 86.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. జూలై నెలలో సాధారణం 104.8 మిల్లీమీటర్లకు గాను, ఈనెల 21వ తేదీ వరకు 95.6 మిల్లీమీటర్ల వర్షం పడింది. దీంతో జిల్లా వ్యాప్తంగా రైతులు పంటల సాగుకు వెనకడుగు వేస్తున్నారు. ప్రధానంగా వరి సాగుపై ప్రభావం పడుతోంది. ప్రస్తుతం బోర్లు, బావుల కింద మాత్రమే రైతులు వరి నాట్లు వేసుకుంటున్నారు. దీంతో ఇప్పటివరకు 42 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అందులో వరి సాగు 5వేల లోపే ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు.

రెండు నెలల్లోనూ లోటు

జోగుళాంబ గద్వాల జిల్లాలో గత నెలతో పాటు, ఈ నెల కూడా లోటు వర్షపాతం నమోదయ్యింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1.40 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. అయితే ప్రస్తుతం కురుస్తున్న ముసురు వానలకు వాడుపట్టిన మెట్ట పంటలు ప్రాణం పోసుకున్నాయి.

దుందుభీకి పెరిగిన వరద



సిర్సవాడలో ప్రవహిస్తున్న దుందుభి

తాడూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో పారుతున్న దుందుబీ నదికి వరద ప్రవాహం గురువారం స్వల్పంగా పెరిగింది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా దుందుబీ నది ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం దుందుబీలో రాకపోకలను పోలీసులు నిషేధించారు. ఎవరూ దుందుబీ నది దాటేందుకు ప్రయత్నించి ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. అదేవిధంగా నది పరివాహక ప్రాంత గ్రామాల వారు ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దుందుబీ నదిలోకి ఎవరూ వెళ్లకూడదన్నారు.

ముసుగేసిన ముసురు

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్/గద్వాలటౌన్/వనపర్తి/కొత్తపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నాలుగు రోజులుగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో భారీ వర్షాలు కురువగా గురువారం ముసురు ముసుగేసింది. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా చినుకులు పడ్డాయి. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసింది. ముసురుతో రహదారులన్నీ చిత్తడిగా మారాయి. ముసురువానతో వాతావరణం పూర్తిగా చల్లబడటంతో చాలామంది ఇళ్ళకే పరిమితం కావాల్సి వచ్చింది. చలికి జనాలు గజగజ వణుకుతున్నారు. రోడ్లపై ప్రజల సంచారం చాలావరకు తగ్గిపోయింది. గురువారం వనపర్తి జిల్లా రేవల్లి మండలం తల్పునూరు గ్రామంలో వర్షంతో ఓ ఇల్లు కూలింది. నాగర్‌కర్నూలు జిల్లా తాడూరు మండలం సిర్సవాడలో దుందుభీ వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నారాయణపేట జిల్లా మరికల్ మండలం పస్పుల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల చుట్టూ నీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. అలాగే, గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి కొత్తపల్లి మండలంలోని నిడ్జింత గ్రామంలో కొల్లంపల్లి దేవమ్మ, భీంరెడ్డికి చెందిన ఇల్లు కూలిపోయింది.

● నారాయణపేట జిల్లా కేంద్ర మండలంలో 47.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. దామరగిద్ద మండలంలో 30.8 మి.మీ., కొత్తపల్లి 28.0, ధన్వాడ 25.5, కోస్గి 24.0, మద్దూర్ 23.8, ఊట్కూర్ 22.0, మరికల్ 18.3, గుండుమాల్ 17.8, నర్వ 15.5, మాగనూర్ మండలంలో 14.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలో 42.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింద. బల్మూరులో 16.8 మిల్లీమీటర్లు, పెద్దకొత్తపల్లిలో 12.0, ఉర్కొండలో 11.2, అచ్చంపేటలో 11.0, బిజినేపల్లి, కల్వకుర్తి లలో 10.4, ఉప్పునుంతలలో 10.2, తిమ్మాజిపేటలో 10.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



నిడ్జింత గ్రామంలో వర్షానికి కూలిన ఇల్లు

● మహబూబ్ నగర్ జిల్లాలోని మహ్మదాబాద్ మండలంలో 34.5 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, గండీడ్‌లో 26.7 మి.మీ., కౌకుంట్ల 22.8, నవాబ్‌పేట 16.7, దేవరకద్రలో 15.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో 20.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి, ధరూర్, గద్వాల లలో 5 మి.మీ. వర్షం కురిసింది.

బీచుపల్లికి పోటెత్తిన భక్తులు

ఎర్రవల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం అమవాస్య సందర్భంగా భక్తులు పోటెత్తారు. గురువారం తెల్లవారుజామున నుంచి కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

బీచుపల్లిలోని కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. అర్చకులు భువనచంద్ర, దత్తుస్వామి, భానుమూర్తి కార్యక్రమం నిర్వహించగా పాలక మండలి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మేనేజర్ సురేందర్‌రాజ్ తెలిపారు.



బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు

నేడు పెన్షన్ అదాలత్, వర్క్‌షాప్ నిర్వహణ

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పెన్షన్, జీపీఎఫ్, అకౌంట్ సంబంధిత పెండింగ్ సమస్యలపై శుక్రవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా పెన్షన్ అదాలత్, వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిరబోయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని, పెండింగ్ పెన్షన్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

జాతీయ స్థాయి విద్యా శిక్షణకు ఎంపిక



వెంకటేష్

ఉప్పునుంతల, జూలై 24 (ఆంధజ్యోతి): నూతన విద్యా విధానంలో భాగంగా ఆగస్టు 27 నుంచి రాజస్థాన్ రాష్ట్రంలో బోధన అభ్యసన ప్రక్రియలను ఆసక్తిగా మార్చేందుకు విద్యలో పప్పెట్రి పాత్ర అంశంపై జాతీయ స్థాయి విద్యా శిక్షణ నిర్వహించనున్నారు. దీనికి నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలోని బాలుర ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గాజుల వెంకటేష్ బోధనా పద్ధతులు ఎంపికైనట్లు ఆయన గురువారం తెలిపారు. బొమ్మలతో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయడం దీని ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు.

ప్రియురాలిపై దాడి చేసి.. ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

- మనస్పర్థాలు రావడంతో బండరాయితో దాడి
- భర్త చనిపోవడంతో యువకుడితో వివాహేతర సంబంధం
- ప్రియురాలి పరిస్థితి విషమం

శంషాబాద్ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మహిళపై దాడి చేసిన ఓ యువకుడు ఆపై ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓఆర్ఆర్ పక్కనున్న డీటీడీసీ కొరియర్ వెనకాల ఉన్న రాజీవ్ గృహకల్పలో నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్త పల్లికి చెందిన వరలక్ష్మి (25) కొన్నేళ్ల నుంచి నివాసం ఉంటోంది.

అయితే కొన్ని రోజుల క్రితం ఈమె భర్త మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కదిరికి చెందిన మన్సూర్ (23) ఈమె ఇంటి పక్కన నివాసం ఉంటున్నాడు. వీరిద్దరి మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతుంది. వీరికి మనస్పర్థాలు రావడంతో వరలక్ష్మి తల్లిదండ్రుల ఇంట్లో ఉంటోంది. గురువారం రూమ్ ఖాళీ చేద్దామని ఆమె రాగా, మన్సూర్‌తో గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన మన్సూర్ బండరాయితో ఆమె తలపై బలంగా కొట్టాడు. తీవ్ర గాయలై రక్తపు మడుగులో ఉన్న వరలక్ష్మి మృతి చెందిందని అనుకొని తన రూమ్‌లోకి వెళ్లి.. మన్సూర్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వరలక్ష్మి తండ్రి తన కూతురుని పోలీసుల సహాయంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మన్సూర్ మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. వరలక్ష్మికి ఇద్దరు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పినట్లు పోలీసులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జడ్చర్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఓ వ్యక్తి మృతి చెందాడు. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... జడ్చర్ల మండలంలోని మాచారం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఈ నెల 21న రాత్రి వాహనం ఢీకొని రాజు(50)కు గాయాలయ్యాయి.

అతన్ని చికిత్స కోసం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియరాలేదని, బంధువుల వివరాలు లభించలేదని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యం

● పీహెచ్‌సీ డాక్టర్ అఫ్రోజ్‌పాష



మాగనూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రోగులకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే మెరుగైన వైద్యం లభిస్తుందని మాగనూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అఫ్రోజ్‌పాష అన్నారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

వర్షాకాలంలో ప్రజలు ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలి?

వర్షాకాలంలో ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మంచినీటిని వేడి చేసి చల్లార్చిన తరువాత తాగాలి.

ఆసుపత్రిలో కుక్క కాటుకు మందులు ఉన్నాయా?

కుక్కకాటుకు మందులు ఉన్నాయి.

ఆసుపత్రిలో ప్రతీ నెలలో ఎన్ని కాన్పులు అవుతాయి?

20 నుంచి 25 కాన్పులు అవుతాయి.

సిబ్బంది సరైన సమయపాలన పాటించడం లేదని ఆరోపణలు ఉన్నాయి?

గతంలో జరిగాయేమో కానీ ఇప్పుడు సిబ్బంది సరైన సమయానికి వస్తున్నారు.

ఆసుపత్రిలో సిజేరియన్లు చేస్తున్నారా?

సిజేరియన్ ఆపరేషన్లు చేయడం లేదు. ఆపరేషన్ అవసరమున్న వారికి మక్తల్, నారాయణపేట, మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేస్తాం.

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్ని సబ్‌సెంటర్లు ఉన్నాయి?

మండలంలో తొమ్మిది సబ్ సెంటర్లు ఉన్నాయి. ప్రతీ సబ్ సెంటర్‌లో వైద్యులు అందుబాటులో ఉన్నారు.

వంతెనల నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో..

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- నెలలు గడుస్తున్నా పునాదుల స్థాయిలోనే పనులు



కొత్తపల్లి-భూనీడు మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం

కొత్తపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వాగులు అనేకం ఉన్నాయి. గ్రామాలకు వెళ్లాలంటే ఆయా వాగులు దాటి వెళ్లాలి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. కొత్తపల్లి మండలంలోని భూనీడు-కొత్తపల్లి, కొత్తపల్లి-మద్దూరు గ్రామాలకు వెళ్లే రోడ్లపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన నడుస్తున్నాయి. గత ఏడాది శంకుస్థాపన చేసిన ఈ పనులను కొన్ని నెలల క్రితం ప్రారంభించారు. ప్రస్తుతానికి నాలుగు నెలలు గడుస్తున్నా పనులు మాత్రం పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. కురుస్తున్న వర్షాలకు రాకపోకలు కొనసాగించే వాహనదారులు, ప్రయాణికులు వంతెనల నిర్మాణం పూర్తి కాక ఇబ్బందులు పడుతున్నారు. మండల అధికారులు ప్రతీరోజు ఈ గ్రామాల మీదుగా ప్రయాణాలు సాగిస్తున్నా పనులను మాత్రం చూసీ చూడనట్లు ముందుకు వెళ్తున్నారు. బుధవారం కురిసిన చిన్నపాటి వర్షానికి నిడ్జింత వాగులోకి నీరు చేరింది. దీంతో మద్దూర్ నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెద్ద వర్షం కురిస్తే భూనీడు, నిడ్జింత కొత్తపల్లి, దుప్పట్టిమట్టు గ్రామాలతో పాటు పలు గ్రామాల ప్రజలకు అంతరాయం కలుగుతుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి వాగుల నిర్మాణాన్ని పరిశీలించి, పనులను వేగవంతం అయ్యేలా చూడాలని వారు కోరుతున్నారు.



నిడ్జింత-మద్దూరు మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద మట్టికట్ట మీదుగా వెళ్తున్న వర్షపు నీరు

ఆల్ట్రా డిజిటల్ ఎక్స్‌రే మిషన్ ప్రారంభం

నారాయణపేటటౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆల్ట్రా పోర్టబుల్ డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను కలెక్టర్ సిక్తా పట్నాయక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో నిర్వహిస్తున్న టీబీ ముక్త్ భారత్ అభియాన్ క్యాంపులకు వచ్చే రోగులకు ఉచితంగా ఎక్స్‌రే తీసి వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్‌ను ఆదేశించారు. అలాగే కార్యాలయంలోనే స్టాఫ్‌నర్స్, ఎంఎల్‌హెచ్‌పీలకు నిర్వహిస్తున్న శిక్షణ గురించి వారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీహెచ్‌ఈవోలు విజయ్‌కుమార్, అశోక్‌కుమార్, డీపీవో భిక్షపతి, ఎస్టీఎల్ఎస్ శ్రీధర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆల్ట్రా డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరిశీలన

నారాయణపేట మునిసిపల్ పరిధిలోని వార్డు నెంబర్ 6లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల బేస్‌మెంట్ లెవెల్ పనులను కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. నాణ్యతగా ఇంటి నిర్మాణం చేపట్టాలని లబ్ధిదారుడికి సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ భోగేశ్వర్లు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి..

నారాయణపేట రూరల్ : విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. గురువారం నారాయణపేట మండలంలోని చిన్నజట్రం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. రిజిస్టర్లను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

వామ్మో.. చిరుత

- పేట-కొండారెడ్డిపల్లి చెరువు శివారు ప్రాంతంలో మూడు చిరుత పులుల సంచారం
- ఆందోళనలో రైతులు
- రక్షణ కల్పించాలని బీకేఎస్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ అధికారులకు వినతి



అటవీ శాఖ కార్యాలయంలో అధికారికి బీకేఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇస్తున్న రైతులు

నారాయణపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా మూడు పులులు నారాయణపేట-కొండారెడ్డిపల్లి చెరువు పరిసర ప్రాంతాల్లో సంచరిస్తుండడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. బుధవారం సాయంత్రం కొండారెడ్డిపల్లి చెరువు సమీపంలో ఓ పెద్దపులితో పాటు, రెండు చిన్న చిరుతలు సంచరిస్తు రైతు లక్ష్మప్ప కంటి కన్పించాయి. దీంతో ఆందోళనకు గురైన అతను తన కంది పొలం నుంచి ఇంటికి చేరుకున్నాడు. వెంటనే బీకేఎస్ నాయకులను కలిసి విషయాన్ని వివరించగా వారు రక్షణ కల్పించాలని గురువారం స్థానిక అటవీశాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. ప్రస్తుతం కంది, పత్తి పంటలు సాగు చేశామని, పొలాల్లో కలుపు ఏరేందుకు కూలీలతో వెళ్తున్నామని, సంచరిస్తున్న చిరుతలు దాడి చేసే ప్రమాదముందని రైతులు వాపోయారు.

ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' ఫారెస్ట్ రేంజ్ అధికారి కమాలొద్దీన్‌ను ప్రశ్నించగా, చిరుతలు ఉన్న మాట వాస్తవమేనని, శుక్రవారం కొండారెడ్డిపల్లి ప్రాంతంలో సీసీ కెమెరా ఏర్పాటుచేసి సిబ్బందితో నిఘా ఉంచుతామన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా అటవీ ప్రాంతాల్లో ఏడు సీసీ కెమెరాలు అమర్చి పర్యవేక్షిస్తున్నామన్నారు.

అందుబాటులో యూరియా

నారాయణపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మండలంలో అవసరం మేరకు యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ అధికారి దినకర్ గురువారం తెలిపారు. మండలంలో 2648 బస్తాల యూరియా ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అందుబాటులో ఉందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. యూరియా పొందేందుకు ఆధార్ కార్డు సమర్పించాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డీఏపీ వంటివి వాడాలన్నారు. డీలర్లు ఎవరైనా ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు విక్రయించినా, ఇతర రాష్ట్రాలకు యూరియా సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో తహసీల్‌లో తహసీల్దార్ అమరేందర్‌కృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఉపాధ్యాయ రంగంలో ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. జీవో 25ను సవరించి 40 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుల పెన్షన్ బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేసి పీఆర్సీ నివేదికలను తెప్పించుకొని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రెడ్డప్ప, వెంకటప్ప తదితరులున్నారు.

ఆడపిల్లలకు అండగా షీ టీమ్

ఊట్కూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలకు అండగా షీ టీమ్ పనిచేస్తుందని జిల్లా షీ టీం సభ్యుడు బాలరాజు అన్నారు. గురువారం మండలంలోని పులిమామిడి గ్రామ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు, మహిళలు ఆపదలో ఉంటే షీటీం సెల్ నెంబర్ 8712670398, 100 డయల్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. షీ టీం సభ్యులు జ్యోతి, కవిత, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువు నీటిని విడుదల చేయాలి

నారాయణపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట-కొండారెడ్డిపల్లి చెరువు నీటిని విడుదల చేసి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని బీకేఎస్ ఆధ్వర్యంలో గురువారం నీటిపారుదల కార్యాలయంలో అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. వర్షాలు కురుస్తుండడంతో పాటు, ఇదివరకే చెరువులో నీటి నిల్వ ఉండడం వల్ల ఆయకట్టు రైతులకు వరి సాగు కోసం నీటిని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో బీకేఎస్ నాయకులు వెంకోబా, అనంత్‌రెడ్డి, వెంకటప్ప, లక్ష్మినారాయణ, మళప్ప, అంజప్ప, కిష్టప్ప, లక్ష్మప్ప, దేవేంద్రప్ప, మన్నే రమేష్ ఉన్నారు.

వర్షాకాలంలో పారిశుధ్య పనులు చేపట్టాలి

- ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్
- ఊట్కూర్ సీపీఎస్‌లో ఉపాధ్యాయుడి అవతారం



ఊట్కూర్ ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్

ఊట్కూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో క్రమం తప్పకుండా పారిశుధ్యం పనులను చేపట్టాలని ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఎస్, అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేసిన అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అంతకుముందు కేంద్ర ప్రాథమిక పాఠశాల(సీపీఎస్)లో ఉపాధ్యాయుడిగా మారి ఐదో తరగతి విద్యార్థులకు గణితం బోధించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి హాజరైన విద్యార్థుల కన్నా రిజిస్టర్‌లో ఎక్కువ మంది ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని వివేకానంద చౌరస్తా వద్ద మురుగునీటి కాల్వలో పైపులైన్ ఉండడంతో వాటిని కాల్వ నుంచి తొలగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చింత రవి, ఎంపీడీవో ధనుంజయ్‌గౌడ్, ఎంపీవో ఎల్ఎన్ఎం రాజు, ఇతర అధికారులు, గ్రామస్థులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం

నారాయణపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభమైంది. ఈ మాసంలో అధికంగా పూజా కార్యక్రమాలు, వ్రతాలు చేపడుతుంటారు. ప్రతీరోజు ఒక్కో దేవున్ని పూజిస్తారు. సోమవారం శివుడికి అభిషేకాలు, మంగళవారం గౌరీవ్రతాలు, బుధవారం విఠలుడికి పూజలు, గురువారం రాఘవేంద్రస్వామి, సాయిబాబా, దత్తాత్రేయ స్వామిలతో పాటు, గురుదేవుల ఆరాధన, శుక్రవారం లోకపల్లి లక్ష్మమ్మ, లక్ష్మీ, తులసి పూజలు, శనివారం వేంకటేశ్వర, ఆంజనేయ, శనేశ్వర తదితర దేవుళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈనెలరోజుల పాటు ఆయా ఆలయాల్లో శ్రావణ మాస పూజలు జరగనున్నాయి.

నేటి నుంచి దోస్త్ ప్రత్యేక దరఖాస్తులు

మక్తల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సులో చేరేందుకు ఈనెల 25 నుంచి 31వ తేదీ వరకు దోస్త్ ద్వారా అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు మక్తల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణగౌడ్ తెలిపారు. ఇదివరకు రిజిస్ట్రేషన్ చేసుకోని వారు ఈసారి చేసుకొని వెబ్ ఆప్షన్ ఎంపిక చేసుకోవచ్చన్నారు. అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణపేట రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట, కోస్గి ఆర్టీసీ డిపో పరిధిలో శుక్రవారం ఉదయం 11 గంటలకు డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నామని డిపో మేనేజర్ లావణ్య తెలిపారు. ప్రయాణికులు 7382826293 నెంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆమె కోరారు.

ఏపీ జల దోపిడీపై నోరు మెదపని రేవంత్‌రెడ్డి

కోస్గి రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ జల దోపిడీపై నోరు మెదపని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీద్దామని బీఆర్‌ఎస్‌వీ కొడంగల్ నియోజకవర్గ నాయకుడు కోట్ల మహిపాల్ అన్నారు. గురువారం కోస్గిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో బకనచర్ల ప్రాజెక్టు, ఏపీ ప్రభుత్వం అక్రమ నీటి దోపిడీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెంకటనర్సిములు, సాయప్ప, శీను, చెన్నప్ప, సంతోష్, అశోక్, బాల్‌రాజ్ తదితరులున్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

మక్తల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి రాణించేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి అనిల్‌గౌడ్ అన్నారు. గురువారం కాంప్లెక్స్ పరిధిలోని జక్లేర్, కర్ని, మక్తల్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి, మాట్లాడారు. ప్రతీ ఉపాధ్యాయుడు ప్రార్థనా సమయానికి ముందే అందుబాటులో ఉండాలన్నారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్కావెంజర్లతో పనులు చేయించాలన్నారు. వర్షాకాలం కావడం వల్ల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. క్యూఆర్ కోడ్ ఓపెన్ చేసి సంబంధిత వివరాలు పొందుపర్చాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రోజువారీ సూచనలు ఇస్తూ నాణ్యమైన భోజనం వడ్డించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వెంకట్రాములు, చంద్రశేఖర్, వేణుగోపాల్‌గుప్తా, గాయత్రి, రమేష్ ఉన్నారు.

నేరాల అదుపునకు నిఘా నేత్రాలు దోహదం

- భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి



సీసీ కెమెరాలను అందజేస్తున్న రాజ్‌కుమార్‌రెడ్డి

మరికల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నేరాల అదుపునకు నిఘా నేత్రాలు ఎంతగానో దోహదపడుతాయని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కే.రాజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలం కేంద్రంలోని రాయిచూర్ రోడ్డులో ఉన్న సరస్వతీ దేవాలయం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులు కోరడంతో తక్షణమే స్పందించి ఆలయ ప్రాంగణంలో గురువారం సీసీ కెమెరాలు ప్రారంభించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొండా రెడ్డి, రాములు, అర్చకులు శివప్రసాద్, ఆశప్ప, ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్‌రెడ్డి, హన్మంతు, సంతోష్, శ్రీనివాస్ అశోక్, నగేష్ తదితరులున్నారు.

మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన

నారాయణపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాకు సంబంధించి చట్టపరమైన అంశాలపై ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం నారాయణపేట ఎస్పీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఎస్పీలు లింగయ్య, మహేష్ సమక్షంలో పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. ఐజేఎం స్వచ్ఛంద సంస్థకు చెందిన జోబి యేసుదాస్, న్యాయవాది మేరక మని, షాబిన్‌జాన్‌లు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది తీవ్రమైన నేరం అని, మానవ హక్కుల ఉల్లంఘన అన్నారు. వ్యవసాయ కార్మిక రంగం, వ్యభిచార గృహాలు, భిక్షాటన, గొర్రెల కాపరి, ఇటుక బట్టీలు, హోటళ్లు, ఇళ్లల్లో అనేక రకాలుగా బలవంతంగా పనులు చేయించి, నిర్బంధించి వేతనాలు ఇవ్వకుండా చేసే వారిని నియంత్రించేందుకు రాష్ట్రంలో ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ అనే స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుందన్నారు. అక్రమ రవాణా జరిగితే ఉమెన్ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ లైన్ 1098, డయల్ 100, 112లకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సీఐలు శివశంకర్, రాజేందర్‌రెడ్డి, సైదులు ఉన్నారు.

వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో పూజలు



కాళబెళగుంది వీరభద్రేశ్వరస్వామిని దర్శించుకున్న కాంగ్రెస్ పార్టీ పేట నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి, నాయకులు

నారాయణపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా వ్యాప్తంగా గురువారం పలు దేవాలయాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు జరిగాయి. జిల్లా సరిహద్దులో గల కాళబెళగుంది వీరభద్రేశ్వర స్వామిని కాంగ్రెస్ పార్టీ పేట నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, వైస్ చైర్మన్ కోనంగేరి హన్మంతు తదితరులు దర్శించుకొని ప్రతేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు హరినారాయణభట్టడ్, సరాఫ్ నాగరాజు, సాయిబాబ, సంక్లపురం మల్లేష్, పోషల్ రాజేష్, సతీష్‌గౌడ్, మనోహర్‌గౌడ్, కార్తీక్, శంకర్, కుర్వమనోజ్, పవన్ తదితరులున్నారు.

కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు

- బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి

మరికల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని, ప్రతీ గ్రామంలో బీఆర్ఎస్ జెండా ఎగరాలని పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లంబడి తిరుపతయ్య అధ్యక్షతన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్‌రెడ్డి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను వివరించారు. ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల కోసం ఓట్లు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్ నాయకులను ఇచ్చిన హామీల అమలుపై నిలదీయాలన్నారు. తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించానని, ప్రస్తుత ప్రభుత్వం కాంగ్రెస్ కార్యకర్తలకే తప్పా ఇతరులకు ఎవరికీ ఇవ్వడం లేదని మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని కలిసికట్టుగా ప్రతీ ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, సంపత్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ రవికుమార్, కృష్ణారెడ్డి, రాజేందర్ గౌడ్, వీరబసంతు, మతిన్, శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాగుతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మాగనూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎగువ కర్ణాటకలో భారీ వర్షాలు కురవడం వల్ల సంగంబండ రిజర్వాయర్‌కు భారీగా వరద పెరిగింది. దీంతో రిజర్వాయర్ గేట్లు ఎత్తాల్సి వస్తోందని, మండలంలోని పెద్ద వాగు తీర గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నాగలక్ష్మి, మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచు రవీందర్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వాగు తీర ప్రాంత ప్రజలు వాగులో ఉన్న కరెంటు మోటార్ పంపులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వాగులోకి పశువులను, గొర్రెలను వదలొద్దని వారు కోరారు.

● కృష్ణ : కృష్ణానది పరివాహక గ్రామా లు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మట్టి మిద్దెల్లో నివాసం ఉన్న ప్రజలు రాత్రివేళ జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇనుప విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లకుండా జాగ్రత్త వహించాలని, రైతులు విద్యుత్ మోటార్లు మరమ్మతు పనులు చేయకుండా జాగ్రత్తగా ఉండా లని ఆయన సూచించారు.

పేదల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

మక్తల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ మక్తల్ మండల అధ్యక్షుడు, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్ అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు గురువారం మండలంలోని గడ్డంపల్లి గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆయన ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పార్టీలకతీతంగా సముచిత స్థానం కల్పిస్తూ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు, రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఉచిత కరెంటు, తాగు, సాగునీరు అందిస్తూ అంకితభావంతో పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోళ్ల వెంకటేష్, బిల్డర్ తాయప్ప, ఓబ్లేష్, జ్ఞానేశ్వర్, రామాంజనేయులు, కురుమయ్య, నాగేష్, సవరన్న, తిమ్మన్న తదితరులున్నారు.

ఘనంగా లక్ష్మమ్మ పల్లకీ సేవ



పేటలో లోకాయపల్లి లక్ష్మమ్మ పల్లకీ సేవ

నారాయణపేట రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోకాయపల్లి లక్ష్మమ్మ అమ్మవారి శ్రావణ మాసోత్సవాల సందర్భంగా గురువారం నారాయణపేటలో ఆలయ పూజారి సోమశేఖరస్వామి నివాసం నుంచి లోకపల్లి వరకు పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు భజన సంకీర్తనలతో అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పురవీధుల గుండా పల్లకీ సేవ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, అశోక్, రాధాకృష్ణ, కన్న జగదీష్, నర్సింలు, హన్మంతు, చంద్రశేఖర్‌గౌడ్, సురేఖ, రాంరెడ్డి, బాలాజీ రావు, వెంకటేష్ తదితరులున్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో అన్నదానం

మక్తల్ : ఆషాఢం అమావాస్య సందర్భంగా గురువారం పట్టణంలోని వీరభద్ర స్వామి ఆలయం, ఉమామహేశ్వర ఆలయం, షిర్డీసాయి బాబా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా ఆలయాల్లో విశేష పూజలు చేశారు. వీరభద్రస్వామి కమిటీ సభ్యులు కల్లూరి నాగప్ప, గుంతలి శివకుమార్, ఈసరి నాగప్ప, కుర్వ వెంకటేష్, పీకే.నర్సింహా, బుగ్గప్ప, సూర్యటైలర్ ఆంజనేయులు, చిన్న కృష్ణయ్య, నారాయణరెడ్డి, పాపిరెడ్డి, నవీన్, నాగరాజు, పెద్ద వెంకటయ్య, వంశీ, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

గుంటి రంగస్వామి ఆలయంలో...

నారాయణపేట టౌన్ : అమావాస్య సందర్భంగా కర్ని గ్రామ గుంటి రంగస్వామి దేవాలయంలో పంది లింగప్ప దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా కృష్ణవేణి అన్నప్రసాద వితరణ కోసం 50 ప్లేట్లను ఆలయానికి అందజేశారు.

ఘనంగా కేటీఆర్ జన్మదినం



కోస్గిలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మక్తల్/కోస్గి/కోస్గి రూరల్/ధన్వాడ/మాగనూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి దేవాలయంలో పార్టీ నాయకులు పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఇంట్లో నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. రామ్మోహన్‌రెడ్డితో పాటు, పార్టీ నియోజకవర్గ నాయకుడు రాజుల ఆశిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు చిన్న హన్మంతు, మాజీ మార్కెట్ చైర్మన్ రాజేష్‌గౌడ్, నాయకులు జుట్ల శంకర్, గార్లపల్లి నర్సింహారెడ్డి, ఆంజనేయులు ఉన్నారు.

అదేవిధంగా, కోస్గి పట్టణంలోని గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ శాసం రామకృష్ణ ఇంట్లో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి, ఐటీ రంగంలో కేటీఆర్ చేసిన సేవలను కొనియాడారు. నాయకులు వెంకట్‌నర్సిములు, జనార్దన్ రెడ్డి, మోహన్‌గౌడ్, మహేష్ తదితరులున్నారు.

గుండుమాల్, వీరారం గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. రవీందర్‌గౌడ్, బాలాజీ, రాఘవ, తిరుపతి తదితరులున్నారు.

ధన్వాడలోని ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి, పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వెంకట్‌రెడ్డి, సుధీర్ కుమార్, సత్యనారాయణగౌడ్, మల్లేష్‌గౌడ్, ఇర్ఫాన్, చంద్రశేఖర్, చంద్రప్ప, నర్సిములు, తాజొద్దీన్, వెంకటేష్ తదితరులున్నారు.

మాగనూరులోని ఆసుపత్రిలో బీఆర్ఎస్ నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పోస్టు అశోక్‌గౌడ్, పల్లె మారెప్ప, పూల రాము, సాబన్న ఉన్నారు.